క్లుప్తంగా

1న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం

నెల్లూరు సిటీ: కాకుటూరు వద్ద ఏపీఎస్ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో 2,870 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని ఇచ్చేందుకు టెండర్లు పిలిచామని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ముందస్తు బిడ్ సమావేశం నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో ఆగస్టు 1వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి పీవీ శేషయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశంలో పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. వివరాలకు www. apsrtc. ap. gov. in లో చూడవచ్చని తెలిపారు. ఆగస్టు 8వ తేదీ వరకు టెండర్ వివరాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

బదిలీ అయిన అధ్యాపకులకు సన్మానం



నెల్లూరు(టౌన్): నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలువురు అధ్యాపకులు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బదిలీపై ఇతర కళాశాలలకు, ఇతర కళాశాలల నుంచి కేఏసీ జూనియర్ కళాశాలకు వచ్చిన వారికి ఆహ్వాన, వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కేఏసీ కళాశాల అధ్యాపకులు లక్ష్మీరెడ్డి, మాధవీదేవి, షాజిదా, వేణుగోపాల్‌రెడ్డి బదిలీపై ఇతర కళాశాలలకు వెళ్లగా, ఇతర కళాశాలల నుంచి నాగేశ్వరరావు, కామాక్షి, యాని గ్రేస్, ఆర్. సురేష్, హెచ్ సురేష్ ఈ కళాశాలకు వచ్చారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని నవాబుపేట రైతుబజార్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మైపాడురోడ్డు విస్తరణ చేసిన ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైపాడురోడ్డు, బోడిగాడితోట, వైకుంఠపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని తెలిపారు.

లేగదూడలను సంరక్షించుకోవాలి



బహుమతి అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు సిటీ: రైతులు లేగదూడలను సంరక్షించుకుని మేలు జాతి పాడిపశువులుగా అభివృద్ధి చేసుకోవాలని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. నగరంలోని పొట్టేపాళెం గ్రామంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా అమలు చేస్తున్న జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా రైతులు మేలు జాతి పశువుల ఉత్పత్తి కోసం లేగదూడల పెంపకం చేపట్టాలని సూచించారు. ఇలాంటి శిబిరాలు ప్రతి మండలంలో వైద్యులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి పశువైద్యం కోసం అంబులెన్స్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం లేదదూడలలో జాతి లక్షణాలు, పెరుగుదల, పోషణను పరిశీలించి మేలుజాతి దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఏడుకొండలు, పశువైద్యాధికారి సుమలత, వైద్యులు సురేష్, అరుణ, శివశంకర్ పాల్గొన్నారు.

విద్యుత్ భవన్ వద్ద నిరసన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా సంస్థ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి విద్యుత్ భవన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కోచైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతిచెందిన గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్ల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రహిత అపరిమిత వైద్య సౌకర్యం కల్పించాలన్న పలు డిమాండ్ల సాధనకు జేఏసీ పలు నిరసన కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఆగస్టు 1వ తేదీ నుంచి విద్యుత్ కార్యాలయాల వద్ద ర్యాలీలు, రిలే దీక్షలు, విజయవాడలోని విద్యుత్‌సౌధ వద్ద మహాధర్నా, విద్యుత్‌సంస్థకు చెందిన ఫోన్ సిమ్‌కార్డులను తిరిగి ఇచ్చేయడం, నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాసులు, దొరస్వామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విక్టర్, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, రఫీ, ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, బాలచంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రొట్టె మార్చుకుంటున్న భక్తులు



బారాషహీద్ దర్గాను దర్శించుకుంటున్న భక్తులు



రొట్టెల పండగకు సర్వం సిద్ధం

- బారాషహీద్ దర్గా వద్దకు చేరుకుంటున్న భక్తులు
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద శనివారం నుంచి ఐదు రోజులపాటు నిర్వహించే రొట్టెల పండగకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించారు. రొట్టెల పండగకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అనుక్షణం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తులు రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు వద్ద, దర్గా ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశారు. పారిశుద్ధ్యం, తాగునీరు, అన్నదానం, విద్యుద్దీపాలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుశాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. శుక్రవారం కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ పలువురు అధికారులతో కలిసి దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుని, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో రొట్టెల పండగను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భక్తులంతా రొట్టెలు మార్చుకునేందుకు, దర్గాలో మొక్కులు చెల్లించుకునేందుకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

షహదత్.. సొందల్‌మాలి

నెల్లూరు(బృందావనం): రొట్టెల పండగ తొలి రోజు శనివారం రాత్రి అమరులైన యోధులను (బారాషహీద్‌లను) స్మరిస్తూ దర్గా ప్రాంగణంలో బారాషహీద్‌ల సమాధుల చెంత షహదత్(ప్రత్యేక పూజలు) నిర్వహించనున్నారు. షహదత్‌లో భాగంగా వీరుల పవిత్ర సమాధులను మతపెద్దలు రాత్రి 11.30 నుంచి 2 గంటల వరకు గులాములు, పన్నీరుతో శుభ్రం చేసి అనంతరం గంధం లేపనం చేసి, చద్దర్‌లను కప్పి 'సొందల్ మాలి' నిర్వహిస్తారు.

గంధ మహోత్సవం

రొట్టెల పండగలో భాగంగా రెండో రోజు ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు బారాషహీద్‌ల గంధ మహోత్సవం జరగనుంది. కోటమిట్టలోని అమీనియా మసీదు నుంచి సంప్రదాయంగా పవిత్ర గంధాన్ని 12 బిందెల్లో తీసుకొనివచ్చి బారాషహీద్‌లకు లేపనం చేస్తారు. అనంతరం భక్తులకు ఆ గంధాన్ని, ప్రసాదాన్ని పంచిపెడతారు. ఈ గంధ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు తరలివస్తారు.

తెహలీల్ ఫాతెహా.. ముగింపు

మంగళవారం ఉదయం తెహలీల్ ఫాతెహా, బుధవారం ఖత్ మే జియారత్(ముగింపు) జరగనుంది. దీంతో ఐదు రోజుల రొట్టెల పండగ పరిసమాప్తమవుతుంది.



దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్‌మర్మత్

విద్యుత్‌శాఖ అన్ని చర్యలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బారాషహీద్ దర్గా వద్ద 5 రోజుల పాటు జరిగే రొట్టెల పండగలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్‌శాఖ అన్ని చర్యలు చేపట్టింది. 24/7 నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా అదనంగా 9 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను, 125 కేవీఏ కెపాసిటీ జనరేటర్‌ను ఏర్పాటు చేసింది. మూడు షిఫ్టుల్లో 29 మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. దర్గా ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, దుకాణాల వద్ద ఎర్తింగ్ పాయింట్లను నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు.



బారాషహీద్ దర్గాకు చేరుకుంటున్న భక్తులు



దర్గా వద్ద భక్తుల వంటావార్పు



స్వర్ణాల చెరువులో భద్రతా సిబ్బంది పర్యవేక్షణ

నేడు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

- శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో శని, ఆదివారాల్లో అన్నమాచార్య ఆరాధన సమితి, నెల్లూరు ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కేవీ సుధాకర్‌రాజు, ఉపాధ్యక్షుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి, సమన్వయకర్త దోర్నాల హరిబాబు శుక్రవారం తెలిపారు. తొలి రోజు శనివారం సాయంత్రం 6 గంటలకు బాలార్క శిష్యబృందంతో సప్తగిరి సంకీర్తనలు, రాత్రి 7 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతికి చెందిన ఆచార్య బ్రహ్మశ్రీ కుప్పా విశ్వనాథశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, రాత్రి 8,.30 గంటలకు ఏకాంతసేవ నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుప్రభాతం, తోమాలసేవ, అర్చన, తిరుప్పావడ, విశేష సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసుడు వినోద్ అన్న మయ్య సంకీర్తనలను ఆలపిస్తారని, సాయంత్రం 6 గంటలకు శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

కళాశాలల బంద్ విజయవంతం

నెల్లూరు(టౌన్): జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైందని ఏబీవీపీ నగర సహాయ కార్యదర్శి నరసింహ తెలిపారు. శుక్రవారం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు కళాశాలల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కళాశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంతో నాయకులు రాహులు, సాయి, రాబర్ట్, సమీర్, సుమన్, వినోద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణకు మొక్కలు నాటాలి

- కమిషనర్ వికాస్‌మర్మత్



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ పిలుపునిచ్చారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఐఏఎస్ సతీమణుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గోమతినగర్‌లోని పబ్లిక్ పార్కులో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సతీమణి సుమలత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పార్కులో పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ఐఏఎస్ ఓడబ్ల్యూ అసోసియేషన్ సభ్యులు 200 మొక్కలు నాటి పర్యవేక్షణ బాధ్యతలను స్థానికులకు అప్పగించారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ అధ్యక్షుడు ముంగమూరు భార్గవరెడ్డి, హరితరెడ్డి, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ సంపత్ కుమార్, ఈఈ సంజయ్, డీఈ సురేష్, ఏఈలు చాణక్య, మాధవి, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజం కోసం కృషి చేద్దాం

- డీఎంహెచ్ఓ పెంచలయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య

నెల్లూరు(బారకాసు): ఆరోగ్యకరమైన సమాజం కోసం వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్‌హెచ్ఎం విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం డీఎంహెచ్ఓ పాల్గొని మాట్లాడారు. వ్యాధులపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం ముందుగా వైద్యసిబ్బంది వ్యాధులు, ప్రాథమికంగా అందించాల్సిన వైద్యసేవలపై మరింత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం పలువురు టీఓటీలు పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు హరిశ్చంద్రప్రసాద్, అమరేంద్రనాథ్‌రెడ్డి, సునీల్, బాలచందర్, రవీంద్ర, శ్రీనివాసులు, నవీన్, ఎన్‌హెచ్ఎం విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న రామ్మూర్తినగర్ బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) రామ్మూర్తినగర్ బ్రాంచ్ పరిధిలోని నెల్లూరు రూరల్ మండలం పెద్దచెరుకూరు గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సీఈఓ డాక్టర్ శంకర్‌బాబు ఆదేశాలతో కళాబృందంతో వీధినాటకం ప్రదర్శన ద్వారా ఆర్థిక అక్షరాస్యత వల్ల కలిగే ప్రయోజనాలు, సహకార బ్యాంక్ సేవలు, బ్యాంక్ కార్యకలాపాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం ఖాతాదారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకి అందజేసే రుణాలు, బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబు, సుష్మారెడ్డి, కళాకారులు, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

అమ్మకు సాటి ఎవరు..!

ఓ వైపు ఆకలి మంట.. మరోవైపు బిడ్డ ఆకలి తీర్చాలన్న తపన.. ఓ చేత తన గారాల బిడ్డను అక్కున చేర్చుకుని.. మరో చేత్తో రోడ్డును శుభ్రం చేస్తున్న ఆ అమ్మను చూస్తే ఎవరైనా సాయం చేయకపోతారా.. ఈ దృశ్యం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది. నెల్లూరు నగరంలోని చిన్నబజారు ప్రాంతంలో ఉన్న బంగారు అంగళ్ల వద్ద సాక్షి కెమెరాకు చిక్కిన దృశ్యమిది.

– చిత్రం – సాక్షి ఫొటోగ్రాఫర్



న్యాయవాది మృతికి సంతాపం



మోకల శ్రీనివాసులు (ఫైల్)

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది మోకల శ్రీనివాసులు శుక్రవారం మధ్యాహ్నం చెన్నైలోని హాస్పిటల్‌లో అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, సహచర న్యాయవాదులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

సెంట్రల్ మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

నెల్లూరు(టౌన్): నగరంలోని శ్రీకస్తూరిదేవి బాలికల విద్యాలయంలో మహిళలకు ఉచిత విద్య అందించేలా సెంట్రల్ మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని శ్రీపొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి కన్వీనర్ సురేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం కోరారు. నగరంలోని కస్తూరిదేవి విద్యాలయానికి సంబంధించిన ఆస్తులన్నింటినీ సెంట్రల్ మహిళా యూనివర్సిటీ కిందకు తీసుకురావాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ మహిళా యూనివర్సిటీ ఏర్పాటుతో 4 వేల మంది బాలికలకు ఉచిత విద్య అందించవచ్చన్నారు. 1923లో కస్తూరిదేవి బాలికా విద్యాలయాన్ని 19.94 ఎకరాల్లో ఏర్పాటు చేశారని, స్వాతంత్ర సమరయోధుడు తిక్కవరపు రామిరెడ్డి కస్తూరిదేవి పాఠశాల భవనాన్ని నిర్మించారని తెలిపారు. ఈ ఆస్తులపై కొంతమంది కన్నుపడిందని, వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సహకరించి ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యతో పాటు బాలికలకు విద్యావసతితో పొణకా కనకమ్మ పేరుతో విశ్వవిద్యాలయం స్థాపించాలని కోరారు. కస్తూరిదేవి విద్యాలయం ఆస్తుల విలువ సుమారు రూ.2 వేల కోట్లకు పైగా ఉంటుందని, కొందరి అండదండలతో పాఠశాల ప్రాంగణంలో 18 ఎకరాలను ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సొడ్కార్ మహబూబ్‌ఖాన్ మునిమనుమడు ఖాదిరిల్లా ఖాన్ కస్తూరిదేవి పాఠశాలకు కొత్త బస్సును దానం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే తిక్కవరపు రామిరెడ్డి కుటుంబసభ్యులు పాఠశాలకు రూ.50 కోట్ల కార్పస్‌ఫండ్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వీరితో పాటు నెల్లూరుకు చెందిన ఎన్ఆర్ఐలు మరో రూ.100 కోట్లు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని కస్తూరిదేవి బాలికా విద్యాలయంలో త్వరితగతిన సెంట్రల్ మహిళా యూనివర్సిటీని స్థాపించాలని కోరారు.

బస్సులు ఏర్పాటు చేయండి

నెల్లూరు సిటీ: నెల్లూరు నగరంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి నగరంలో బస్సులు ఏర్పాటు చేయాలని ఓ కాలర్ 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమంలో డిపో మేనేజర్-1 మురళీకృష్ణకు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లోని డీఎం చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు తమ ప్రాంతంలోని బస్సుల సమస్యలను ఆయన డీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారులకు సమస్యలు తెలియజేసి పరిష్కరిస్తానని డీఎం హామీ ఇచ్చారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి



మహిళా సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

- ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): క్రమశిక్షణ, శారీరక దృఢత్వం కలిగి ఉండి ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి కవాతును చక్కగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం సిబ్బంది సమస్యల పరిష్కారానికి దర్బార్‌ను నిర్వహించారు. సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. విధినిర్వహణలో, ఆరోగ్య, విద్య తదితర అంశాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖ ప్రభుత్వ ముఖచిత్రమని, రిసెప్షనిస్టు పోలీసుస్టేషన్‌కు వెన్నుముక అని పేర్కొన్నారు. సిబ్బంది ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓపికగా విని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని తెలిపారు. చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పోలీసు వెల్ఫేర్ క్యాంటీన్‌లో అన్నిరకాల వస్తువులు తక్కువ ధరలకే అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సివిల్, ఏఆర్, హోమ్‌గార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎనెల్ ఆస్పత్రిలో వెయ్యి గుండె ఆపరేషన్లు



విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్యులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని మాగుంట లేఅవుట్, పీవీఆర్ కల్యాణ మండపం సమీపంలో ఉన్న ఎనెల్ హాస్పిటల్‌లో గుండెకు సంబంధిచి 1,000 ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు ఆ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వెయ్యి ఆపరేషన్లు జయప్రదంగా నిర్వహించిన సందర్భంగా శుక్రవారం ఆ హాస్పిటల్‌లో విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేంద్రప్రసాద్, హాస్పిటల్ చైర్మన్ దశరథనాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ తాము విజయవంతంగా నిర్వహించిన వెయ్యి ఆపరేషన్లను సామాన్యులకు అతి తక్కువ ఖర్చుతో నిర్వహించడం సంతోషాన్నిచ్చిందన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్, సిబ్బంది పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాధులపై అవగాహన అవసరం

నెల్లూరు(బారకాసు): హెపటైటిస్(కాలేయ) వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని నారాయణ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యుడు డాక్టర్ ఎంజీ శ్రీనివాస్, డాక్టర్ ద్వారకానాథ్ తెలిపారు. అంతర్జాతీయ హెపటైటిస్ డే సందర్భంగా శుక్రవారం చింతారెడ్డిపాళెంలోని నారాయణ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధి వైరస్, బ్యాక్టీరియా, ప్రోటోజోవా, కొన్ని మందులు తదితర కారణాలతో వస్తుందన్నారు. చలిజ్వరం, తలనొప్పి, తీవ్రమైన ఒళ్లునొప్పులు, వికారంగా ఉండడం, విరేచనాలు కావడం, ఆకలి తగ్గిపోవడం, మూత్రం పసుపు వర్ణంలో రావడం, కళ్లు, నాలుక పచ్చగా మారిపోవడం జరుగుతాయన్నారు. కాలేయ భాగం విపరీతమైన నొప్పిగా ఉంటుందని తెలిపారు. హెపటైటిస్ వచ్చిన వారికి గ్లూకోజ్‌తోపాటు పండ్లరసాలు, కొబ్బరినీళ్లు తాగించాలని తెలిపారు. అవసరం మేరకు విటమిన్-సి ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుందని, వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవడం ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ ఆర్.హరీష్, ఆపరేషన్స్ హెడ్ రామారావు, డీజీఎం శేఖర్‌రెడ్డి, ప్రభాకర్, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.